క్లుప్తంగా

ప్రజల దాహార్తి తీర్చిన మంత్రి



నర్వ: మండలంలోని ఉందేకోడ్ గ్రామంలో తాగునీటి అవసరాల నిమిత్తం మంత్రి వాకిటి శ్రీహరీ ఆదేశాల మేరకు శుక్రవారం బోరు వేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనువాసులు పూజలు నిర్వహించి శుక్రవారం బోరును ప్రారంభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తాగునీటి అవసరాల నిమిత్తం బోరు వేయించిన మంత్రి వాకిటి శ్రీహరీకి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నయ్యసాగర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనువాసులు, ఎంపీఓ రాఘవేందర్, మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు అశోక్‌గౌడ్, గ్రామ నాయకులు కొండన్న, నాగప్పగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ ఎంపీడీఓగా వెంకటేశ్వర్‌రెడ్డి

ధన్వాడ: మండల పరిషత్ డెవలప్‌మెంట్ అధికారిగా వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పని చేసిన సాయి ప్రకాష్ గద్వాల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డికి ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆయనకు సన్మానం నిర్వహించి అభినందనలు తెలిపారు.

అంబులెన్స్ సేవల్లో నిర్లక్ష్యం వద్దు

మక్తల్: పట్టణంలో అంబులెన్స్‌లను స్టేట్ స్టోర్ అధికారి సత్యనారాయణ, ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ అధికారి రవికుమార్‌లు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లోని పరికరాలను, రికార్డులను పరిశీలించి మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్క కేసును రికార్డులో నమోదు చేయాలని సూచించారు. అంబులెన్స్ సహాయం కోసం ఫోన్‌కాల్ వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఈఎంఈ రాఘవేంద్ర, ఈఎంటి చంద్రశేకర్, పైలెట్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జన సురక్ష పథకాలపై అవగాహన



మాగనూర్: తెలంగాణ గ్రామీణ బ్యాంకు మాగనూర్ బ్రాంచి ఆధ్వర్యంలో కొత్తపల్లిలో జన సురక్ష పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంక్ మేనేజర్ జగదీష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బ్యాంకు అకౌంట్ కలిగి ఉండాలని జీరో అకౌంట్ (పీఎంజేడీ) గురించి వివరించారు. అలానే ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమాను తీసుకోవాలని ఇందులో ఏడాదికి రూ.436 చెల్లించి సహజ మరణం పొందితే రూ.2 లక్షలు బీమా వస్తుందన్నారు. అటల్ పెన్షన్ యోజనలో తగిన ప్రీమియం చెల్లిస్తే 60 ఏళ్ల నుంచి రూ.1000 నుంచి రూ.5వేల వరకు పెన్షన్ సదుపాయం పొందొచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింహరెడ్డి, బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాన్‌కుర్తిలో గోరింటాకు పండుగ



దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థినులు గోరింటాకు పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం అన్నపూర్ణ ఉపాధ్యాయినులు గోరింటాకు ప్రత్యేకతను వివరించారు. విద్యార్థినులు ప్రత్యేకంగా తయారు చేసిన గోరింటాకును చేతులపై రాసుకొని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినిలు లక్ష్మి, అనిత, గోదావరి, గాయత్రి, పీఈటీ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం

మాగనూర్: లయన్స్ క్లబ్ సేవా భవనంలో పాలమూరు కందూరు రాంరెడ్డి సౌజన్యంతో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో శుక్రవారం వడ్వాట్ గ్రామంలో కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 35 మందికి కంటి పొరల సమస్యలు ఉన్నట్లు గుర్తించి వారిని ఆపరేషన్ నిమిత్తం రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు సత్యంగౌడ్, ఖాజాద్దీన్, వడ్వాట్ గ్రామం నాయకులు రవీందర్, రాఘవరెడ్డి, గోపాల్‌రెడ్డి, జానప్ప, రాములు, ఈదప్ప పాల్గొన్నారు.

బీమా.. అతివలకు ధీమా

- ప్రభుత్వమే చెల్లిస్తున్న ప్రీమియం
- రుణ, ప్రమాద బీమా అమలు
- బాధిత కుటుంబాలకు పరిహారం



మద్దూరులో సమావేశమైన పొదుపు మహిళలు

మద్దూరు: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు అపద వస్తే అదుకునేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఈ క్రమంలోనే స్వయం సహాయక సంఘాల మహిళలకు అండగా నిలిచేందుకు రుణ, ప్రమాద బీమా పథకాలకు శ్రీకారం చుట్టింది. ప్రమాదంలో మృతి చెందిన స్వయం సహాయక సంఘ మహిళల కుటుంబాలకు రూ.10 లక్షల వరకు పరిహారం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. అదే విధంగా రుణం పొందిన మహిళ సహజంగా మృతి చెందితే ఆమె కుటంబానికి రుణ బీమాను వర్తింపజేసి అండగా నిలువనుంది. ప్రమాద బీమాను 2024 మార్చి 14 నుంచి వర్తింపజేయనుంది. దీని ద్వారా జిల్లాలో 8,407 స్వయం సహాయక సంఘాల్లో 91,188 మంది మహిళలకు ఆర్థిక చేయూత కలుగనుంది.

బీమా.. భవిష్యత్‌కు రక్షణ కవచం

జిల్లాలో ఇప్పటి వరకు ముగ్గురు మహిళలు ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు అధికారులు గుర్తించారు. వారికి ప్రమాద బీమా పథకం కింద రూ.10 లక్షల పరిహారం అందింది. మృతి చెందిన సభ్యురాలు స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాలు తీసుకొని చెల్లించకపోయి ఉంటే ప్రభుత్వం ప్రకటించిన రూ.10లక్షల్లో రుణ బకాయిలు మినహాయించుకొని మిగితా డబ్బులు బాధిత కుటుంబాలకు అందజేస్తారు. సహజ మరణం పొందిన మహిళల కోసం అమలు చేస్తున్న రుణ బీమా పథకం కోసం 20 మందిని గుర్తించారు. వీరికి బీమా పథకం సొమ్ము రూ.13.70లక్షల సొమ్మును చెల్లించినట్లు అధికారులు తెలిపారు. సహజ మరణం పొందిన సభ్యులకు మాత్రం రూ.2 లక్షల్లోపు రుణ బకాయిలు ఉంటే ప్రభుత్వమే చెల్లించి వారి రుణ ఖాతాలను మూసివేయనుంది.

- ప్రమాదంలో 50 శాతం వైకల్యం పొందితే రూ.5 లక్షలు చెల్లిస్తారు. మృతి చెందిన మహిళకు పొదుపు అప్పు ఉంటే అది కూడా పూర్తిగా మాఫీ చేస్తారు. ఇందుకోసం గాయాలపాలైన మహిళా అంగవైకల్యం తెలుపుతూ సదరం సర్టిఫికెట్, చికిత్స పొందిన అసుపత్రి పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. బీమా సౌకర్యం 18 నుంచి 60 ఏళ్ల వయస్సు ఉన్న సభ్యులకు మాత్రమే వర్తించనుంది.

ప్రీమియం చెల్లించకుండానే బీమా

మహిళా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు గతంలో కొంతమేర ప్రీమియం చెల్లిస్తే మిగతాది ప్రభుత్వం జమ చేసేది. ప్రస్తుతం సంఘాలకు ప్రభుత్వమే నేరుగా ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. ఎలాంటి ప్రీమియం చెల్లించకుండానే రుణ, ప్రమాద బీమాలను అమలు చేస్తోంది.

బీమాతో పేద మహిళలకు భరోసా



మహిళల ఆర్థిక స్వావలంబనకు స్వయం సహాయక సంఘాలు కీలక భూమిక పోషిస్తున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం అందిస్తున్న బీమా సౌకర్యాలు మహిళలకు భవిష్యత్‌పై మరింత భరోసా కల్పిస్తున్నాయి. భద్రతను మరింత పెంపొందిస్తున్నాయి. బీమా సౌకర్యం గురించి సంఘంలోని మహిళలకు వివరిస్తున్నాం. దీనిపై మహిళలందరూ అవగాహన పెంచుకోవాలి.

– అనసూయ, పొదుపు సంఘం సభ్యురాలు, రెనివట్ల

ఎంతో ప్రయోజనం



రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు కల్పించిన ప్రమాదబీమా సౌకర్యంతో బాధిత కుటంబాలకు ఆర్థిక భరోసా కలుగనుంది. ఈ పథకాల అమలుపై మహిళా సంఘాలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. అందరూ దీనిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటాం.

– మొగులయ్య, డీఆర్‌డీఏ పీడీ, నారాయణపేట

నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి, కాడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి

కొత్తపల్లి/ మద్దూరు/ కోస్గి: నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి చొరవతో నిధుల ప్రవాహం కొనసాగుతుందని కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి, కాడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి అన్నారు. ఉమ్మడి మద్దూరు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే పర్ణికారెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్దూరు మండలంలోని నాగిరెడ్డి పల్లి నుంచి సిద్దేశ్వర దేవాలయం వరకు బీటి రోడ్డు, గ్రామంలో సీసీ రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణానికి రూ.3.51 కోట్లు అలాగే మద్దూరు పోలీస్ స్టేషన్ కంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.60 లక్షలు పెదిరిపాడ్ నుంచి దేశాయపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.6.8 కోట్లు, కొత్తపల్లి మండలంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి నిడ్జింత వరకు బీటీ డబుల్‌రోడ్డు నిర్మాణానికి రూ.6.75 కోట్లు మంజూరు చేయగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సింములు, మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి

నారాయణపేట టౌన్/నారాయణపేట: జిల్లా కేంద్రంలోని స్థానిక చిన్న పిల్లల ఆసుపత్రి వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను స్థానిక ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి ప్రారంభించారు. ఈ స్టాల్స్‌లో మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనను తిలకించి అభినందించారు. మేళాలో ఉంచిన తిను బండరాలు, చీరలు, బుట్టలు, స్వీట్లు, మహిళల ఆభరణాలు తదితర వస్తువులను పరిశీలించి వాటి తయారి విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఈ మేళాను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు ఎమ్మెల్యేకు వివరించారు.

అమ్మ పేరు మీద మొక్క నాటాలి

కొత్తపల్లి: ఏకో క్లీన్ మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా నిడ్జింత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు తల్లి పేరు మీద మొక్కలను నాటారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బయో పార్క్‌లో సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులు గులాబి, మల్లె, మందారం, జాజిమల్లి పలు రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మన అమ్మ పేరు మీద రెండు మొక్కలు నాటాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, దేవేంద్రప్ప, కతలప్ప, నాగేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టెస్సా జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



నారాయణపేట: టెస్సా నారాయణపేట జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఓమాచారీ, కార్యదర్శి గా బి.నర్సింహులు,ఉపాధ్యక్షుడు గా జి.శ్రీనివాస్‌రెడ్డి, కోశధికారి వి.నసీరుద్దీన్, కో - కార్యదర్శిగా జి.చేతన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గా - ఎం.బస్వరాజ్, పబ్లిసిటీ సెక్రటరీ - పి.బాలకృష్ణరెడ్డి,కార్యవర్గ సభ్యులుగా - వి.శ్రీనివాస్, ఎ. యాగంటి లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని శాలువాలతో సన్మానించారు.

మరమ్మతు చేపట్టాలి

దేవరకద్ర రూరల్: లక్ష్మీపల్లి బీటీరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు శుక్రవారం కలెక్టర్, ఆర్‌అండ్‌బీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. 2017లో వేముల స్టేజ్ నుంచి లక్ష్మీపల్లి, హజిలాపూర్, చౌదర్‌పల్లి మీదుగా 167వ జాతీయ రహదారిని కలిపేందుకు 17 కిలోమీటర్ల మేర డబుల్‌రోడ్డు వేసేందుకు అప్పటి ప్రభుత్వం రూ. 23 కోట్లు మంజూరు చేసిందని, టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి నిధుల సమస్యతో పనులను మధ్యలోనే నిలిపివేడరని తెలిపారు. దీంతో రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం కురిసినప్పుడు, రాత్రి వేళల్లో గుంతల రోడ్డుపై ప్రయాణించాలంటే మరింత నరకయాతన పడాల్సి వస్తుందని వాపోయారు. రోడ్డుకు మరమ్మతు చేయాలని అధికారులకు అనేకమార్లు విన్నవించినా ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని కోరారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



కోస్గి: పట్టణ శివారులోని పోచమ్మ గ్రామ దేవతకు శుక్రవారం బోనాల వేడుకను ఘనంగా నిర్వహించారు. ఏటా ఆషాడ మాసంలో గ్రామ దేవతలకు బోనాలు నిర్వహించడం అనవాయితీ. ఈ సందర్భంగా పట్టణంలోని పలు కాలనీలకు చెందిన మహిళలు, యువతులు ప్రత్యేకంగా వేప కొమ్మలు, పసుపు కుంకుమలతో అలంకరించిన మట్టి కుండల్లో అమ్మవారికి నైవేద్యం వండి బోనాలతో ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించారు. అమ్మవారికి కోడి పుంజులను బలి ఇచ్చి తమ కోర్కెలు తీర్చాలని ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

పరిశుభ్రత మనందరి బాధ్యత

కోస్గి రూరల్: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని మున్సిపల్ మేనేజర్ అనిల్‌కుమార్ అన్నారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 13వ వార్డులో తడి-పొడి చెత్తపై ఇంటింటా అవగాహన కార్యక్రమం చేపట్టారు. తడి , పొడి చెత్తను వేరు వేరు బుట్టలలో వేసి చెత్తసేకరణ సిబ్బందికి అందించాలని తడి చెత్తతో ఎరువులు తయారు చేయవచ్చన్నారు. వస్తువుల వినియోగానికి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి బట్ట సంచులను వాడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్‌అసిస్టెంట్ మొహిన్‌బాషా, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, కార్మికులు ఉన్నారు.

కొనసాగుతున్న రైతు నమోదు పక్రియ



కోస్గి రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధి పొందడానికి చేపడుతున్న రైతు నమోదు ప్రకియ కొనసాగుతుందని ఏఈఓలు తిరుపతి, నరేందర్‌లు అన్నారు. శుక్రవారం గుండుమాల్ మండల పరిధిలోని అమ్లీకుంట గ్రామంలో రైతు నమోదు ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు మంజూరు చేసే పథకాలకు గుర్తింపు కార్డు అవసరమన్నారు. భూమి కలిగిన ప్రతి రైతు తప్పకుండా వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించి యూనిక్ ఐడీని పొందాలని సూచించారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



కొత్తపల్లి: సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని మాజీ ఎంపీటీసీ చెన్నయ్య అన్నారు. మండల కేంద్రానికి చెందిన బాబయ్య గౌడ్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలో వైద్యఖర్చుల నిమిత్తం రూ.లక్ష నగదు మంజూరు కాగా అందుకు సంబంధించిన చెక్కును కాంగ్రెస్ నాయకులు బాబయ్య గౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు పార్థివ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

కోస్గి రూరల్: బాలికలకు చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేయడం వల్ల శారీరక , మానసిక సమస్యలు ఏర్పడుతాయని, తల్లిదండ్రులు బాల్యవివాహాల నిర్మూలనకు సహకరించాలని జిల్లా సఖీ కేంద్రం నిర్వాహకురాలు కవిత అన్నారు. శుక్రవారం పట్టణంలోని గుడిదోడ్డిలో ప్రభుత్వ పథకాలు-సామాజిక అంశాలు అనే అంశంపై ఓయంఐఎఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కల్పించారు. బాల కార్మికుల నిర్మూలన, మూఢనమ్మకాలు, జోగిని వ్యవస్థలను నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో ఈశ్వరమ్మ, రాములు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య కరువు



విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ధన్వాడ: మండం కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల అధ్వనంగా మారిందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు విమర్శించారు. శుక్రవారం పాఠశాలను వారు సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడంలేదని మెనూ ప్రకారం శుక్రవారం గుడ్డు ఇవ్వాల్సి ఉండగా అరటి పండు ఇచ్చి చేతులు దులుపుకున్నారని పట్టణ అధ్యక్షులు మల్లేష్‌గౌడ్ ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారు తప్ప ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సరైన విద్యను అందించడం లేదని దుయ్యబట్టారు. అలాగే ధన్వాడలో పలు కల్వర్టులు కూలిపోయి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే మారుతీనగర్, కుర్వగేరిలో కూలిపోయిన కల్వర్టులను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శివారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు వడ్లశాంతి, ఎస్సీ సెల్ నాయకులు రాము, అంజీ, మైనారిటీ నాయకులు నాసర్, కృష్ణదాస్, వెంకటేష్, ఇర్ఫన్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మీపతిగౌడ్

ఊట్కూరు: ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ అన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి తండా గ్రామంలో శుక్రవారం జిల్లా న్యాయసేవా సంస్థ, లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి ఒక్కరికి సమాన హక్కులు కల్పించిందని ప్రజలు వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడు ప్రజలు తమ హక్కులను నిర్భయంగా పొందవచ్చన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటి సంస్థ ద్వార పేదలకు ఉచిత న్యాయాన్ని అందిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిలర్ లక్ష్మీపతిగౌడ్, నాగేశ్వరి, కార్యధర్శి అరుణజ్యోతి, ఏఎస్ఐ సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



తపస్ సభ్యత్వాన్ని తీసుకుంటున్న ఉపాధ్యాయులు

కోస్గి రూరల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం గుండుమాల్ మండల కేంద్రంతో పాటు బలుబద్రాయపల్లి గ్రామంలోని పాఠశాలలో తపస్ సభ్యత్వ నమొదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, అన్ని డీఎలను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాఘవేందర్, ప్రధాన కార్యదర్శి ఆనంతయ్య , పరందాములు, రాఘవేందర్ , రాజశేఖర్ , రామకృష్ణ , బిచ్చయ్య , శ్రీనువాస్ తదితరులు ఉన్నారు.

తపస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమెదు

మక్తల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం చేయడంలో తపస్ ముందుంటుందని జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, జక్లేర్, గుడిగండ్ల గ్రామాల ప్రాథశాలల్లో ఉపాధ్యాయులకు తపస్ సభ్యత్వం అందించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హమీలను నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగేశ్వరయ్య, చంద్రకళ, జాకీర్, గురుపాదయ్య, తపస్ నాయకులు నాగర్జున, మండల అధ్యక్షుడు రవీందర్, నర్సిరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదంపై సంబరాలు



మక్తల్‌లో సంబరాలు జరుపుకొంటున్న కాంగ్రెస్ నాయకులు

నారాయణపేట: రాష్ట్ర మంత్రివర్గం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ తేవడంపై పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి. సలీం హర్షం వ్యక్తం చేశారు. ఇది బీసీలకు సామాజిక న్యాయం అందించే చారిత్రాత్మక నిర్ణయమన్నారు. పాలనలో బీసీలకు నైతికంగా, రాజకీయంగా తగిన స్థానాన్ని కల్పించడంలో ఈ నిర్ణయం మైలురాయిగా నిలిచిపోతుందన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

మక్తల్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు రాష్ట్ర క్యాబినేట్ ఆమోదం తెలుపడంతో శుక్రవారం మక్తల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో బాణా సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి చిత్రపటాలకు పాలతో అభిషేకం చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలుపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల మార్కెట్ వైస్ చైర్మన్ గణేశ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు రవికుమార్, మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేశ్, మాజీ ఉప సర్పంచ్ కట్టసురేశ్, కట్టవెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కోటా కేటాయింపుపై కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, లక్ష్మణ్, రఘు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేయడంపై సీఎం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరికు కృతజ్ఞతలు తెలిపారు.

జనాభా నియంత్రణ అందరి బాధ్యత



కోటకొండలో ర్యాలీని ప్రారంభిస్తున్న జీహెచ్ఎం సునీత



మాగనూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

నారాయణపేట రూరల్: జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జీహెచ్ఎం సునీత, ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ విరోజా అన్నారు. విద్య, వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కోటకొండ, చిన్నజట్రం గ్రామాల్లో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ నిర్వహించగా జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. జనాభా పెరిగితే అన్ని రకాల సమస్యలు వస్తాయని, జనాభా నియంత్రణకు తాత్కాలిక, శాశ్వత పద్ధతులను అవలంబించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనాభాను నియంత్రించాలి

దామరగిద్ద: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ నారాయణ మాట్లాడుతు జనాభా నియంత్రణ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు, సూపర్‌వైజర్‌లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ

మాగనూర్: మండల కేంద్రంలో వైద్య సిబ్బంది, స్థానిక హైస్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రోజు రోజుకు దేశంలో జనాభా గణనీయంగా పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరు నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఇతర డాక్టర్లు,సూపర్‌వైజర్ వెంకటేష్, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నిషియన్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన

ధన్వాడ: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించారు.

అనర్థాలపై అవగాహన

మరికల్: మండల కేంద్రంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జనాభా పెరుగుదలతో కలిగే అనర్థాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రాఘవేందర్‌రెడ్డి, కిరిటి, స్ఫూర్తి ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



దామరగిద్దలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు



ధన్వాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది